# మోజు

- తమిరిశ జానకి

ఇంకా సినిమా మొదలెట్టలేదు. హాల్లో అట్టే జనం కూడా లేరు. ఫ్యాన్ కింద సీట్లు చూసుకుని కూలబడ్డారు రవి అతని స్నేహితులు.

మూర్తి ఏదో చెప్తుంటే "ఊ" కొడుతూ, అటూ, ఇటూ చూస్తున్నాడు రవి. అలా చూస్తున్నవాడు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. ఇబ్బందిగా కుర్చీలో కదిలాడు... దానిక్కారణం, అప్పుడే హాల్లోకి వస్తున్న నలుగురాడవాళ్లు... ఇదివరకటి కంటే కొంచెం చిక్కినా సువర్ణని గుర్తుపట్టాడు. వాళ్లు తమముందు వరసల్లోకే వొస్తుంటే రవి గుండెల్లో రైళ్ళు పరిగెత్తడం మొదలెట్టాయి... మొహం పూర్తిగా మరోవైపుకి తిప్పేసుకుని, రుమాలుతో మొహం తుడుచు కుంటున్నట్టుగా కూర్చున్నాడు.

"ఇప్పుడెలా? ఇవాళ ఎవరిమొహం చూశాను. తనని చూసి గుర్తు పట్టిందంటే కొంప మునగదూ? సినిమా అయిపోయాక, బయట నిలేసిందంటే తనేం చెయ్యగలడు నీళ్ళు నమలడం తప్ప.... "నమ్మించి ఇంత మోసం చేస్తావా? ప్రేమించడానికి తయారయ్యావు గానీ, పెళ్ళి పేరెత్తేసరికి పరారవుతావా? నిన్నేం చేస్తే పాపం?" అంటూ భద్రకాళిలా విరుచుకుపడితే తనేం జవాబు చెప్పగలడు? నలుగురి ముందు తన మర్యాద మంట కల్సిపోదూ?... స్నేహితుడి పెళ్ళని చెప్పి తనీ ఊరు రావడమేమిటి? ఊరికే ఉండక ఇలా సినిమా ప్రోగ్రాం వెయ్యడం ఏమిటి? సువర్ణ ఈ ఊళ్ళో ఉందని తెలిస్తే పెళ్ళికి వచ్చి ఉండేవాడే కాదేమో! అయినా సువర్ణ ఈ ఊళ్లో ఎందుకుందీ? ఏదైనా ఉద్యోగం చేస్తోందేమో! ఔను. అదే అయి ఉంటుంది... ప్రేమ ఒకరితో, పెళ్ళి ఒకరితో ఆడవాళ్ళసలు భరించలేరంటారు... పాపం... పెళ్ళి చేసుకుని ఉండదు... ఔను... పెళ్ళయి ఉంటే భర్తతోనే వచ్చి ఉండేది సినిమాకి....! ప్రాణంగా ప్రేమించింది తనని; కాలేజీలో చదివే రోజుల్లో. "నిన్నే నా మనసులో ప్రతిష్టించుకున్నాను రవీ! నువ్వు కాదంటే జీవితాంతం కన్యగానే ఉండిపోతాను గానీ, వేరొకర్ని పెళ్ళాడను. నన్ను అన్యాయం చెయ్యవుగా?" అంటూ తన కౌగిట్లో గువ్వలా ఒదిగిపోయేది?

సువర్ణ అందానికి ముగ్ధుడై, మోజుపడి స్నేహం చేశాడు. ఆ స్నేహం ప్రేమలోకి దిగింది. ఆనాటి వయసు పొంగులో ఒకరితో ఒకరు ఎన్నెన్నో బాసలు చేసుకున్నారు.

"నువ్వులేని నేనులేను సువర్ణా" అన్నాడు తను.

"నీతోనే నా జీవితం రవీ!" అంది సువర్ణ.

పరీక్షలయ్యాయి.

"మళ్ళీ త్వరలోనే కలుస్తాను. మా అమ్మా, నాన్నలను ఒప్పించడానికి కొంచెం టైముపడుతుంది. నువ్వేం కంగారుపడకు... నారాక కోసం ఎదురు చూస్తూ ఉండు. మా అమ్మా, నాన్నల్ని వెంటపెట్టుకు వొస్తాను. మీ వాళ్ళతో మాట్లాడటానికి... అంతవరకూ ఎక్కడా ఈ విషయం పొక్కనీయకు" అంటూ రైలెక్కాడు. కన్నీళ్ళతో వీడ్కోలు చెప్పింది సువర్ణ. అప్పట్లో సువర్ణని మోసం చెయ్యాలన్న ఉద్దేశం తనకులేదు... కానీ ఇంటికి వెళ్ళేసరికి అమ్మా, నాన్నలు, "నీకోసం ఓ మంచి సంబంధం చూసి ఉంచా"మన్నారు. పిల్ల ఫోటో చూపించారు. కళ్ళు జిగేలుమన్నాయి. "అమ్మాయి అప్సరస. ఒక్కత్తే కూతురు. పెద్ద ఆఫీసరుగారమ్మాయి, సొంత మేడ, కారూ, నౌకర్లూ, పొలాలూ అన్నీ ఉన్నాయి. అన్నీ తండ్రి తదనంతరం ఆ పిల్లకే చెందుతాయి" అంటూ ఏకరువు పెట్టారు.

అన్నీ వినేసరికి మతి పోయింది తనకి. ఆ అమ్మాయి అందం ముందు సువర్ణ అందం దిగుదుడుపే! ఆరుగురి సంతానంలో మూడోది సువర్ణ. పైగా వాళ్ళనాన్న ఒక చిన్న గుమాస్తా. ఇంకో రెండేళ్ళల్లో రిటైరవబోతున్నాడు. కట్నంకాదు కదా లాంఛనాలైనా జరిపించలేడు. ఆయన రిటైరయిపోతే మరదళ్ళ పెళ్ళిళ్ళకి తనే కొద్దో గొప్పో డబ్బు సాయం చెయ్యవలసి వస్తుంది. ఇవన్నీ ఆలోచించి తండ్రి చెప్పిన సంబంధానికి అంగీకారం అందచేశాడు. సువర్ణని తల్చుకోగానే – పార్వతీ, దేవదాసూ; సలీమ్, అనార్కలీ, లైలా మజ్నూలు వరసగా మనసులో మెదిలారు. కానీ వాళ్ళ ప్రేమలు భగ్నమవడానికి కారణాలు మాత్రం తన ఆలోచనల్లోకి రాకుండా జాగ్రత్తపడ్డాడు... అంతే – వసంతతో తన పెళ్ళి జరిగిపోయింది. సువర్ణను మళ్ళీ కలుసుకునే అవసరం లేకపోయింది. సువర్ణ మనసులో మెదిలినప్పుడల్లా, "తను చేసుకోకపోతే జీవితాంతం కన్యగానే ఉండిపోతానంది. తననే మనసులో తల్చుకుంటూ, ఏనాటికైనా తప్పక తను వస్తాడన్న ఆశతో ఎదురు చూస్తూ ఉండి ఉంటుంది... పిచ్చిగా తనని ప్రేమించింది... పాపం..." అనుకునేవాడు.. కానీ ఇవాళ... ఏడాదిన్నర తర్వాత... ఇక్కడ, ఇలా సువర్ణని చూడాల్సి వస్తుందని తను అనుకున్నాడా? ఇప్పుడు సువర్ణకి ఎదురుపడటానికి ధైర్యంచాలదు తనకి.

"సువర్ణ కంటపడకుండా ఈ హాల్లోంచి బయట పడేటట్టు చెయ్యి... సతీ సమేతంగా నీ కొండకి వస్తాను" ... ఆపద మొక్కులవాడిని శరణుకోరాడు.

!+!+!+!

హాల్లో జనం ఎంతమంది ఉంటారా! అని చూస్తూ, యాదాలాపంగా తల వెనక్కి తిప్పిన సువర్ణకి వెనక వరసల్లో ఒక వరసలో రవి కనిపించగానే చటుక్కున మొహం తిప్పేసుకుంది.

"ఇంకానయం అతనెటో చూస్తున్నాడు. తనని గమనించలేదు" భయంగానూ, ఇబ్బందిగానూ కదిలింది కుర్చీలో. "రవి ఈ ఊళ్ళోనే ఉంటున్నాడా? వాళ్ళదీ ఊరుకాదని

గుర్తు....అయినా ఈ ఊళ్ళో ఏదైనా ఉద్యోగం చేస్తూ ఉండొచ్చుగా... తననిచూసి గుర్తుపట్టి, నీ అంతమోసగత్తె ఇంకొకత్తి ఉండదన్నాడంటే తన పరువేంకాను?"

"ప్రాణంగా ప్రేమించిన నన్ను కాదని మరొకడిని కట్టుకున్నావా? నిన్ను తప్ప మరెవరినీ పెళ్లాడనంటూ నాలో ఆశలు రేపి, నా మనసు దోచుకుని చివరికి బాగా డబ్బున్నవాడిని, నాకంటే అందమైన వాడిని చూసి వాడిచేత మెళ్ళో తాళి కట్టించేసుకు వెళ్ళిపోయావా? ఇదేనా నీ ప్రేమ? అని అడిగితే తనేం చెప్పగలదు?

అయినా అతను వొచ్చిన ఈ సినిమాకే తనూ రావాలీ? తనమీద గొంతుదాకా కోపం ఉండి ఉంటుంది... ప్రాణసమంగా ప్రేమించాడు... తనని మర్చిపోలేక, పెళ్ళిచేసుకుని ఉండదు. ఔను, చేసుకునిఉంటే పక్కన భార్య ఉండేదిగా? ఒంటరిగానే వొచ్చాడు.... తను అతని మొహంలోకి చూపింది ఒక్క క్షణమే అయినా, అతనిమొహంలో ఎంతమార్పు వొచ్చిందీ స్పష్టంగా కనపడింది. ఏదో పోగొట్టుకున్న వాడిలా దిగులుగా ఉన్నాడు. మొహంలో సంతోషం ఏమాత్రం లేదు. తనుచేసిన అన్యాయం అతని మనసులో మాననిగాయంగా అయి ఉంటుంది. "నువ్వే నా హృదయంలో వేరొకరికి స్థానం లేదు. మన పెళ్ళి జరగకపోతే, ఇంక ఈ రవి జీవితాంతం బ్రహ్మచారిగానే ఉండిపోతాడు తప్ప, ఇంకో అమ్మాయి మెళ్ళో తాళి కట్టడం జరగదు సువర్ణా" అనేవాడు ప్రేమగా చేతుల్లో చుట్టివేస్తూ...

"అమ్మా నాన్నల్ని వెంట పెట్టుకుని మరీ వొస్తాను పెళ్ళిమాటలకి" అంటూ కొంటెగా నవ్వి వెళ్ళి పోతున్నప్పుడు తనకి తెలియకుండానే కళ్ళల్లో నీళ్ళు వొచ్చాయి. అది తల్చుకుంటే ఇప్పుడు ఆశ్చర్యం వేస్తుంది. అతనలా ఊరెళ్ళాడు. మంచి సంబంధం వొచ్చింది తనకి. "నీ అంత అదృష్టవంతురాలు లేదే సువర్ణా!

"ఒక్కడే కొడుకు. పెద్ద ఆఫీసరుద్యోగం. కారు మేడ!...ఓహ్! రాజాలాంటి సంబంధం. పిల్ల అందమైనదీ, గుణవంతురాలూ అయితే చాలునట. ఇంకేపట్టింపులూ లేవుట. వాళ్ళ బంధువొకాయన ఈ ఊళ్ళో ఉన్నాడులే. ఆయనే నీగురించి ఆ పిల్లవాడికి రాశాడట. పెళ్ళిచూపులకి ఏర్పాటు చేయించమని చెప్పి వెళ్ళాడు" అంటూ అబ్బాయి ఫోటో, తండ్రి తన చేతికి అందించేసరికి నోటమాట పెగల్లేదు తనకి... రవి మనసులో మెదిలాడు. తండ్రితో ఎలా చెప్పాలో తెలియలేదు. అతని పేరు ప్రశాంత్‌ట!

ఆ రాత్రి నిద్రలేదు తనకి. ఒక ప్రక్క రవీ, మరో ప్రక్క ప్రశాంత్... ఆలోచనల్లో నిలిచారు. ముగ్గురు సంతానంలో రెండోవాడు రవి... తల్లిదండ్రులకి ఒక్కడే కొడుకు ప్రశాంత్. పెద్ద మేడలు రెండున్నాయిట వాళ్ళకి. నౌకర్లుట, స్వంత కారుందిట, రవీ వాళ్ళకి కారెక్కడుందీ... ఉన్నట్టు ఎప్పుడూ చెప్పలేదు. పైగా రవి చదువుకంటే పెద్ద చదువు ప్రశాంత్‌ది. పెద్ద హోదాలో ఉన్నాడు. మంచివాడుట. ఏలోపంలేని ఇంత మంచి సంబంధం తన బోటిదానికి రావడం,

నాన్నగారు చెప్పినట్టు తన అదృష్టమే అనిపించింది. అతన్ని చేసుకుంటే తన జీవితం పూలబాటలో సాగిపోవడం ఖాయం. కానీ పాపం రవి?

జీవితాంతం, తననే మనసులో ఆరాధిస్తూ బ్రహ్మచారిగా ఉండిపోతాడేమో? పెద్దవాళ్ళు ఒప్పుకోకపోతే ఎవరికీ చెప్పకుండా రిజిష్టరు మ్యారేజి చేసేసుకుందాం అన్నాడు.

రిజిష్టరు మ్యారేజి చేసుకుంటే అటు పెద్దవాళ్ళకి, ఇటు పెద్దవాళ్ళకి దూరమైపోవడం ఖాయం. నలుగుర్లోనూ తలెత్తుకు తిరగలేక, ఏదో తప్పుచేసినట్లు బిడియపడవలసి వొస్తుంది. రవి తండ్రి ఆస్తి ఇవ్వను పొమ్మని అంటే అనచ్చు. అప్పుడు తన జీవితం ముళ్ళ బాటమీద నడవదూ? చూస్తూ, చూసూ, కొరివితో తల గోక్కోవడ మెందుకూ అనిపించింది.

అంతే... పెళ్ళిచూపులు; ముహూర్తాలు పెట్టడం; వైభవంగా ప్రశాంత్‌తో తనపెళ్ళి అన్నీ వరసగా జరిగిపోయాయి. భర్తతో ఈ ఊరు వొచ్చేసింది తను.

అవన్నీ తల్చుకుంటే జాలివేస్తోంది రవి మీద... పిచ్చిగా ప్రేమించాడు తనని. గుడ్డిలో మెల్ల... తన భర్తకీ ఊర్నించి ట్రాన్స్‌ఫర్ అయిపోతుందీ నెలాఖరుకి. ట్రాన్‌ఫర్ సంగతి తెల్సి అయ్యో అనుకుంది నాలుగు రోజులక్రిందట!... కానీ, ఇప్పుడు అంతా మనమంచికే అనిపిస్తోంది. ఈ ఊళ్ళోనే ఉంటే మళ్ళీ ఎప్పుడో ఒకసారి రవి తటస్థపడతాడేమో అన్న భయం, బెంగతో చావాలి. అప్పటి మాటెలావున్నా ఇప్పుడీ గండం గడవాలి. అతని మొహంలోకి చూసే ధైర్యంలేదు. కంటబడే ధైర్యం అసలే లేదు. "రవి కంటబడకుండా, ఈ థియేటర్లోంచి బయటపడేటట్టు చూడు స్వామీ! ఈ సమ్మర్లో శ్రీవారితో కల్సి, మా సొంతకార్లో నీ కొండకొచ్చి నిన్ను దర్శించుకుంటాను!" అని అలివేలుమంగా పతిని మనస్ఫూర్తిగా తల్చుకుంటూ, కుర్చీల సందుల్లోనుంచి క్రీనీడలోకి కదిలింది. అప్పటికే రవి హాల్లోనుంచి అస్తమించాడు.

★☆★☆★